

# అమెరి "కలగూరగంప" కామెడీ
## వంగూరి చిట్టెన్‌రాజు



### పెళ్ళి చేసి చూడు

**21**

**ఇటీవల మా అమ్మాయి పెళ్ళి, పెటాకులూ..**అనగా రిసెప్షనూ అయిపోయిన నాలుగు రోజుల తరవాత నేను రొఖ్ఖం లెక్కలు చూసుకుంటూ "అందుకే అన్నారు పెళ్ళి చేసి చూడు" అన్నాను మా క్వీన్ విక్టోరియాతో. "సరేలే...ఇంక చూడ్డానికే ముంది, గుండు సున్నా తప్పు. నేను పెళ్ళి కుదిరిన నాటినుంచీ చెప్తూనే ఉన్నాను...ఒరే మొగుడు గారూ....ఆవేశపడి ఎడాపెడా ఖర్చు పెట్టేయ్యకూ...లేకపోతే వాళ్ళని హనీమూన్‌కి ఆస్ట్రేలియా కాదు, ఆముదాల వలసకి కూడా పంపించడానికి డబ్బుండదూ అని...వింటేనా..." అంటూ సుదీర్ఘంగా నిట్టూర్చింది మా క్వీన్ విక్టోరియా. ఇంతకీ జరిగిన సంగతి ఏమిటంటే పెళ్ళి కుదరగానే మొత్తం ఎంత ఖర్చు అవుతుందీ అని ముందే ఒక బడ్జెట్ వేసుకున్నాను. ఎందుకైనా మంచిది అని అందులో సగం మాత్రమే మా ఆవిడకి చెప్పాను. లేకపోతే ఆవిడకి హార్ట్ ఎటాక్ అయినా రావచ్చును, లేదా నాకు మరింత ఘాటిగా టెంకి జెల్లలు తగల వచ్చును. పెళ్ళికి ముందు హార్ట్ ఎటాకులూ, టెంకి జెల్లలూ లాంటి కార్యక్రమాలు శోభస్కరం కాదు కదా! పైగా ఆర్ధిక విషయాలలో అర్ధాంగితో అయినా సరే అబద్ధాలు ఆడవచ్చును అని ఎవరో బుద్ధిహీనుడు చెప్పగా విని కొంచెం ధైర్యం కూడా తెచ్చుకున్నాను. ఉదాహరణకి పెళ్ళి కుదిరిన మర్నాడు వేసిన నా అంచనా ప్రకారం పెళ్ళి ఖర్చు సుమారు లక్ష డాలర్లు అవుతుంది అనిపించింది. అప్పుడు మా ఆవిణ్ణి పిలిచి "ఇదిగో, ఈ పెళ్ళి ఖర్చు సుమారు యాభై వేలు అవుతుంది ఏమంటావ్?" అన్నాను. అప్పుడు ఆవిడ తన అందమైన కనుగుడ్లు తేలేసి, "అయ్య బాబోయ్, యాభై వేలే..సగం మందిని కట్ చేసెయ్. నీవేపు నుంచి నీ సాహిత్య సభలకి డొనేషన్ ఇచ్చిన ఎనమండుగురినీ మందినీ పిలు, చాలు. లేక పోతే మళ్ళీ నీకు విరాళాలు ఇవ్వరు. ఇక నా వేపునుంచి మా వాళ్ళు యాభై మందీ వస్తారు. అప్పుడు పాతిక వేలలో పెళ్ళి చేసెయ్యవచ్చు." అంది మా క్వీన్ విక్టోరియా. ఈ యుద్ధం ఎలాగా నెగ్గలేను కాబట్టి, "అశ్వత్థామ హతహః కుంజరః" టైపులో చిన్నా, చితకా "ఆర్ధిక అబద్ధాలు" మా క్వీన్ విక్టోరియాకు చెప్తూ మొత్తానికి వివాహం జరిపించేశాం.

ఇక్కడో పిట్ట కథ చెప్పాలి. అమ్మాయి పెళ్ళి కుదరగానే బడ్జెట్ వేసుకోడం కోసం పిల్లల పెళ్ళి చేసి అనుభవం ఉన్న కొంతమంది పాత స్నేహితులని పిలిచాం. వాళ్ళ సలహాలు భలే తమాషాగా ఉన్నాయి. ఉదాహరణకి మొ.పా.స్నే...అంటే మొదటి పాత స్నేహితుడు...."మీ అమ్మాయి పెళ్ళా! నువ్వు చెయ్య లేవు. పోనీ ఇల్లు తాకట్టు పెట్టావా?" అనే డైలాగులతో సంభాషణ మొదలు పెట్టాడు. ఎందుకంటే వాడు నా కంటే ఎంతో ధనవంతుడిని అనీ ఆ లెవెల్‌కి నేను తూగలేనూ అని చిరకాలంగా అతని అభిప్రాయం. అందుకే నేను "కళ్యాణ మండపానికి ఎంతవుతుందీ" అని అడగ్గానే "వెల్, మా అమ్మాయి పెళ్ళి మండపానికి పదిహేను వేలయింది. నీకు పదిహేను వందలలో

మంచి మండపాలే వస్తాయి, పరవాలేదు". అన్నాడు. అలాగే "పెళ్ళి భోజనాలకి ఎంతవుతుందీ" అని అడగ్గానే "వెల్, మా అమ్మాయి పెళ్ళికి వంద డాలర్స్ పెర్ హెడ్ అయింది. అఫ్ కోర్స్ మేము పాతిక పదార్థాలు పెట్టాం అనుకో. నువ్వు కాస్త తక్కువ మందిని పిలిచి, ఐటెంస్ తగ్గిస్తే పది డాలర్లలో చేసెయ్య వచ్చును." అన్నాడు మొ.పా.స్నే. అతను చెప్పిన పాయింట్లన్నీ నోట్ చేసుకుని, రెం. పా. స్నే. ని పిలిచాను. ఈయన అదే కేటగిరీలో మరొక సబ్ కేటగిరీ. "కళ్యాణ మండపానికి ఎంతవుతుందీ" అని అడగగానే "మొ.పా.స్నేని పిలవకు. వాడికి గొప్ప కావాలి. అన్నీ ఎక్కువ చెప్తాడు. మామూలుగా దర్జాగా చెయ్యాలంటే మండపం డెకొరేషన్స్‌కి పదిహేను వేలు అవుతుంది. నీకు పదిహేను వందలలో కూడా వస్తాయి. ఇంతకీ ఇల్లు తాకట్టు పెట్టావా?". అన్నాడు రెం. పా.స్నే. ఈ ఇద్దరూ ఒకే కేటగిరీ స్నేహితులనీ, చెప్పిన సమాధానాలు కూడా వారిది గొప్పా, నాది దిబ్బా అనే పద్ధతిలోనే ఉన్నాయనీ తెలిసిపోయింది నాకు. ఎంతయినా బ్రిలియంట్ ఫెలోని కదా. ఇక మూ. పా. స్నే ఇంకొక కేటగిరీ. నిజమైన ఖర్చు చెప్పేస్తే తాను ధనవంతుడు అనుకుని నేను పెళ్ళికి అప్పు అడుగుతానేమో అనుకుని "ఆ ఏముంది గురూ, మండపానికి, ఐదు వందలూ, భోజనానికి మనిషికి పది డాలర్లూ చాలు. నువ్వు ఈజీగా మేనేజ్ చెయ్యగలవు" అని సరిగ్గా అదే అంకెలు తన భాషలో చెప్పాడు.



మొత్తానికి వేసుకున్న బడ్జెట్‌కీ, క్వీన్ విక్టోరియాకి చెప్పిన అబద్ధపు ఖర్చు వివరాలకీ, అనుకున్న దానికన్నా సవాలక్ష డాలర్లు ఖర్చు అయినా సలక్షణంగా మూడు రోజుల బాటు మా అమ్మాయి పెళ్ళి జరిగింది. మొదటి రోజు అదేమిటో "సంగీత్" ట...ఆ కార్యక్రమం జరిగింది. ఆ రోజు మా పిల్లల స్నేహితులైన యువతీ యువకులు నూట యాభై మంది కేవలం వాళ్ళకి మాత్రమే అర్థం అయే జోకులూ, డాన్సులతో మొహాలు వెలిగిపోతూ ఉంటే నేనూ, మా ఆవిడా మొదలైన పెళ్ళి పెద్దలం మొహాలు వేళ్ళాడేసుకుని దూరంగా కూచున్నాం. ఆ సంగీత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మా అబ్బాయి ఆడియన్స్‌లో అదోలా కూచున్న నన్ను చూసి జాలిపడి వేదిక మీదకి ఆహ్వానించాడు. పబ్లిగ్గా బావుండదని నేను అప్పుడు నవ్వు మొహం పెట్టాను. కావాలంటే ఇక్కడ వేసిన ఫొటో చూడండి. మా అబ్బాయి ఈ సంగీత్ నిర్వహించిన తీరు చూసి కొందరు వాణ్ణి "చిప్ ఆఫ్ థె ఓల్డ్ బ్లాక్" అనడం బాగానే ఉంది కానీ, నన్ను ఓల్డ్ అనడం ఏ కోశానా బాగా లేదు.

ఇక రెండో రోజు మా స్వగృహంలో మా అమ్మాయిని పెళ్ళి కూతురు చెయ్యడం, అంకురార్పణ, ఎదురు సన్నాహం కార్యక్రమాలు చేశాం. ఈ రోజు మటుకు మా అందరి మొహాలు వికసించినా, ఆ యువతీ యువకుల మొహాలు కందిపోయాయి. ఎందుకంటే,అమెరికాలో సాధారణంగా జరగని విధంగా, మా ఇంటి ముందూ, వెనకాల తోటలోనూ పెద్ద పందిళ్ళు వేసి, రెండు వందలమందిని పిలిచి, అందరికీ అరిటాకులలో బూరెలతో సహా భోజనాలు పెట్టాం. ఈ తరం వారికి అరిటాకులూ తెలియదు, బూరెలూ తెలియదు కదా! అప్పుడు నేను వడ్డిద్దామనుకుంటే, అప్పటికే అరిటాకులు పూర్తిగా ఖాళీ అయిపోయాయి. ఇక మూడో



రోజు..అంటే పెళ్ళి రోజు మేము ఏదో మూడు, నాలుగు వందల మంది వస్తారులే అనుకుంటే....మా హ్యూస్టన్ మిత్రులే కాక అమెరికాలో అనేక ప్రాంతాలనుండి సుమారు ఏడు వందల మంది వచ్చి పెళ్ళి ముమ్మల్నీ, మా కంటే ఎక్కువగా విందు కేటరింగ్ చేసిన రెస్టారెంట్ వారినీ మహదానంద పెట్టారు. నేను వేసుకున్న బడ్జెట్ "విఫల" మవడానికి ఇదే మంచి సంతోషకరమైన కారణం. ఈ పెళ్ళి ఆర్భాటం అంతా తన మూడో భార్యతో చూసిన మా పక్కింటి జాన్సన్ మొన్న కనపడి "నేనూ ఇలా పెళ్ళి చేసుకుంటే, నాకు మూడో పెళ్ళి అవసరం రాక పోవును" అని వాపోయాడు.



అఫ్‌కోర్స్, ఇక్కడ వేసిన పెళ్ళి మండపం ఫొటోలు రెండు చూస్తే మా మొ.పా.స్నే నుండి మూ.పా.స్నేహితులు ఏమనుకుంటారో నాకు తెలియదు.

అన్నట్టు పెళ్ళి సమయంలో మా అమ్మాయి, అల్లుడితో మా క్వీన్ విక్టోరియాకి తీసిన ఫొటో కూడా చూడండి. నిజానికి అప్పుడు నేనూ మా అల్లుడి పక్కన నిల్చున్నాను కానీ, ఆ ఫొటోగ్రాఫరు ఆ ముగ్గురినీ చూస్తూ "బ్యూటిఫుల్, యు ఆల్ లుక్ బ్యూటిఫుల్" అంటూ నన్ను మటుకు కావాలనే ఫొటోలో పడకుండా తీసాడని నా అనుమానం.



ఇక్కడ వేసిన మా అమ్మాయీ, అల్లుడూ పెళ్ళి ముందూ, పెళ్ళి అవగానే తీయించుకున్న ఫొటోలు కూడా చూసి వాళ్ళిద్దరినీ ఆశీర్వదించమని అందరినీ కోరుతున్నాను.





Post your comments